క్లుప్తంగా

ఇసుక లారీ సీజ్



సీజ్ చేసిన లారీతో ఏఎస్సై గంగాధరరావు

నిడదవోలు రూరల్: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న క్వారీ లారీని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు సబ్ డివిజన్ టాస్క్‌ఫోర్స్ ఏఎస్సై జీఆర్‌కే గంగాధరరావు ఆదివారం తెలిపారు. కొవ్వూరు మండలం ఔరంగబాద్ ఇసుక ర్యాంపు నుంచి ఎటువంటి బిల్లులు లేకుండా తణుకుకు ఇసుక తరలిస్తుండగా డి.ముప్పవరం వద్ద తనిఖీలు నిర్వహించి లారీని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి లారీని సమిశ్రగూడెం పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఆయన వెల్లడించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: మండలంలోని 33/11 కేవీ రామన్నపాలెం సబ్‌స్టేషన్‌లో 11 కేవీ రామన్నపాలెం రూరల్ ఫీడర్‌పై ఆర్డీఎస్ పనులు జరుగుతున్నందున సోమవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. ఫీడర్ పరిధిలోని ధుమంతునిగూడెం, కొత్తగూడెం, సుబ్బరాయపురం గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎన్టీ రామారావు విగ్రహావిష్కరణ



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బూరుగుపల్లి శేషారావు, నాయకులు

నిడదవోలు రూరల్: మండల పరిధిలోని గోపవరంలో నూతనంగా ఏర్పాటు చేసిన దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహాన్ని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు ఆదివారం ఆవిష్కరించారు. ఈ మేరకు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ ఆరేపల్లి భాగ్యలక్ష్మి, నాయకులు వెలగన సూర్యారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ ఉపాధ్యక్షుడిగా పిన్నమనేని



పిన్నమనేని వెంకట రత్నం (ఫైల్)

గోపాలపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ ఉపాధ్యక్షుడిగా గోపాలపురం మండలం వేళ్లచింతలగూడెం సీనియర్ నాయకుడు పిన్నమనేని వెంకటరత్నం (చినబాబు)ను ఎంపిక చేసినట్లు మండల పార్టీ అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి ఆదివారం తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీచేసినట్లు పేర్కొన్నారు. పార్టీ ఎంతో నమ్మకంతో ఇచ్చిన ఈ పదవికి న్యాయం చేస్తానని ఇందుకు సహకరించిన మాజీ హోంమంత్రి డాక్టర్ తానేటి వనితకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

10 మంది జూదరుల అరెస్టు

తాళ్లపూడి: మండలంలోని గజ్జరం గ్రామంలో ఆదివారం పేకాట శిబిరంపై పోలీసులు నిర్వహించారు. ఈ మేరకు తనిఖీల్లో పేకాడుతున్న 10 మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.12,340 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. దాడిలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. మండలంలో జూదాన్ని ఎవరైనా ప్రోత్సాహిస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

మెడికల్ షాపుల్లో డ్రగ్స్ అధికారుల తనిఖీలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఔషధ నియంత్రణాధికారులు ఆదివారం మూడు మందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. మందుల దుకాణాల్లో సిడినాఫిల్ సిట్రేట్ (వయాగ్రా) మందులు విక్రయిస్తున్నారనే సమాచారం అందిన కారణంగా ఈ తనిఖీలు నిర్వహించినట్లు డ్రగ్స్ అధికారులు చెబుతున్నారు. కొయ్యలగూడెం, బుట్టాయిగూడెంలలో వయాగ్రా దందా అధికంగా నడుస్తోంది. ఆ ప్రాంతాలకు రాజమహేంద్రవరం కేంద్రంగా మందులు సరఫరా అవుతున్నాయని సమాచారం. దేవీచౌక్‌లోని అపోలో, బైపాస్‌రోడ్డులోని సంజీవనీ మెడికల్స్, గోరక్షణపేటలోని సత్య మెడికల్స్‌లో తనిఖీలు చేశారు. ఈ దుకాణాల్లో ఎటువంటి ఆధారాలు లభించలేదు. అపోలో మెడికల్స్‌లో వయాగ్రా మందులు ఉన్నప్పటికీ వాటన్నింటికీ ఆ దుకాణం నిర్వాహకులు డ్రగ్స్ అధికారులకు సంబంధిత బిల్లులు చూపించారు. డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ హరహరితేజ మాట్లాడుతూ దేవీచౌక్ అపోలో మెడికల్‌తో పాటు మరో రెండు దుకాణాల్లో సిడినాఫిల్ సిట్రేట్ (వయాగ్రా) మందులు బిల్లులు లేకుండా అమ్ముతున్నారనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. అటువంటి ఆధారాలు కనిపించలేదన్నారు. అపోలో మెడికల్‌లో సరిగా రిజిస్టర్ మెయింటెనెన్స్ చేయకపోవడం వంటివి కనిపించాయన్నారు. ఆయనతో పాటు మరో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కళ్యాణి ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

సంక్షోభంలో సంక్షేమ గృహాలు

- అధ్వానంగా ఎస్సీ బాలికల హాస్టల్ దుస్థితి
- నత్తనడకన మరమ్మతు పనులు
- సమస్యలతో విద్యార్థులు సతమతం



సమిశ్రగూడెం ఎస్సీ బాలికల వసతిగృహం

నిడదవోలు రూరల్: పేద విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఏర్పాటుచేసిన సంక్షేమ వసతిగృహాలు సంక్షోభంలో కూరుకుపోయాయి. చలికాలంలో విద్యార్థుల వెన్నుల్లో వణుకు పుట్టిస్తోంది. సొంతభవనాలు లేక, మరుగుదొడ్లు, తాగునీరు, స్నానపు గదులు, వార్డెన్లు, సిబ్బంది, గదులు కొరత ఇలా ఒకటేమిటి అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఎస్సీ, బీసీ వసతిగృహాల్లోని విద్యార్థులు సమస్యలతో పడుతున్న బాధలు వర్ణనాతీతం. నియోజకవర్గంలోని నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల పరిధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమ వసతిగృహాలు తొమ్మిది ఉన్నాయి. ప్రధానంగా సమిశ్రగూడెంలో ఎస్సీ బాలికల వసతిగృహం సమస్యలకు నిలయంగా మారింది. ఇక్కడ ఇరుకుగదులతో ప్రశాంతంగా చదువుకోవడానికి అనువుగా ఉండటం లేదని విద్యార్థినులు వాపోతున్నారు. భవనం శిథిలావస్థకు చేరడంతో సంక్షేమశాఖ నిధులు రూ.22.15 లక్షలతో చేపట్టిన పనులు నత్తతతో పోటీపడుతున్నాయి. భవనం చుట్టూ రంగులు వేయడంతో పైపైనే మెరుగులు కనిపిస్తున్నా..లోపల మాత్రం సమస్యలు వెక్కిరిస్తున్నాయి. కిటికీ తలుపులు, మెస్‌లు పాడవ్వడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్‌కు సంబంధించిన పనులు ఇంకా చేపట్టలేదు. దీంతో పనిచేయని ఫ్యాన్లు దర్శనమిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలని విద్యార్థినులు కోరుతున్నారు.



పాడైన కిటికీ మెస్‌లు



వసతిగృహంలోని ఇరుకైన వరండాలో చదువుకుంటున్న విద్యార్థినులు



మూలకు చేరిన ఆర్వోప్లాంట్

సమాజసేవలో భాగస్వామ్యం కావాలి



లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడు దేవరపు వెంకట రాయిడు దంపతులను సన్మానిస్తున్న మంత్రి, ఎమ్మెల్సీలు



ఎయిమ్స్‌లో విద్యార్థిని గారపాటి జాన్వి పద్మజను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

చాగల్లు: సమాజసేవలో ప్రతిఒక్కరు భాగస్వామ్యం కావాలని, లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ వీకే పంక జాక్సన్ శ్రీ అన్నారు. చాగల్లులో క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. నూతన అధ్యక్షుడుగా వల్లిపల్లి వెంకట రామారావు, ఉపాధ్యక్షుడిగా నల్లూరి అప్పారావు, ఆళ్ల సత్తిబాబు, ఇతర కార్యవర్గ సభ్యులతో కొత్తపల్లి రవికుమార్ ప్రమాణం చేయించి బాధ్యతలు అప్పగించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న అల్లూరి గౌరిరావు మాట్లాడుతూ మరింత సేవా భావంతో నూతన కార్యవర్గం ముందుకు సాగాలన్నారు. ఢిల్లీ ఎయిమ్స్‌లో సీటు సాధించిన గారపాటి జాన్వి పద్మజ చౌదరి, నీట్‌లో ర్యాంకు సాధించిన కొడవటి మోహిత్ శ్రీరామ్, తదితరులను సన్మానించారు.

లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలే స్ఫూర్తి

పెరవలి: విద్యార్థి దశనుంచే తాను లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలను చూస్తూ పెరిగిన వాడినని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పెరవలి లయన్స్ క్లబ్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆదివారం ముఖ్య అతిథిగా మంత్రి విచ్చేసి ప్రసంగించారు. వైఎస్సార్ పార్టీ ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ తాను 15 ఏళ్లక్రితం స్థాపించిన పెరవలి లయన్స్ క్లబ్ నేడు దినదినాభివృద్ధి చెంది ఎన్నో సేవా కార్యక్రమాల చేపట్టిందని నూతన కార్యవర్గం ఇలాగే కొనసాగించాలన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన దేవరపు వెంకట రాయుడు సెక్రటరీ సలాది ఉదయ భాస్కర రావు, ట్రెజరర్‌గా బూరుగుపల్లి రాజు, 19 మంది సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

దళితుల అభ్యున్నతికి జీవితాంతం కృషి

తాళ్లపూడి: మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్‌వద్ద వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నియోజకవర్గ పరిశీలకులు గొండే శ్రీనివాసరెడ్డి , మండల నాయకులు కలిసి డా. బాబూ జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిటీ అధ్యక్షుడు కొప్పాక పోసియ్య మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ దళితుల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో గెడ్డం రాజు, బొట్టా భాస్కర రావు, పసలపూడి పుష్పరాజు, గెడ్డం గణేష్, గెడ్డం గాంధీ, విజేత పబ్లిక్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు డా.ప్రమోద్ కుమార్ ఉన్నారు.

మానవత సంస్థ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

తాళ్లపూడి: మండలానికి సంబంధించి మానవత స్వచ్ఛంద సంస్థ శాఖ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఆదివారం జరిగింది. ఈ మేరకు వెలుగుబంటి శ్రీనివాస్ నూతన అధ్యక్షుడిగా, కార్యదర్శిగా సనపల రాజశేఖర్, కోశాధికారిగా ఏ.హనుమంత రావు, కార్యవర్గ సభ్యులతో మానవత సంస్థ చైర్మన్ సింహాద్రి జనార్దనరావు అధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులు ప్రమాణం చేశారు. అవసరమైన కొంత మందికి సహాయం అందించలేక పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలోని పేదలకు సేవలు అందించాలని పలువురు తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సంస్థ ప్రతినిధులు వి.చంద్రయ్య, గెడ్డం సాయిబాబా, గోకవరపు బాబులు తదితరులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ప్రకటించాలి



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యువజన సేవా సంఘం సభ్యులు

నిడదవోలు రూరల్: భారతదేశం గర్వించదగిన నాయకుడు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని వైఎస్సార్ సీపీ సమిశ్రగూడెం గ్రామ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్ అన్నారు. సింగవరం, సమిశ్రగూడెం, గోపవరం, రావిమెట్ల, కోరుమామిడి, తాడిమళ్ల, కోరుపల్లి గ్రామాల్లో బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న పురస్కారం ప్రకటించాలని కేఎన్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గెడ్డం రవీంద్రబాబు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాబూ యువజన సేవా సంఘం అధ్యక్షుడు రాజారత్నం, కార్యదర్శి శ్రీను, నాయకులు రామ్మోహన్‌రావు, అక్రం, శ్రీనివాస్, ప్రవీణ్, ఎమ్మార్పీఎస్, అరుంధతీసేవా సంఘం సభ్యులు, దళిత నాయకులు పాల్గొన్నారు.

ఎన్నో పదవులు నిర్వర్తించిన మహోన్నత వ్యక్తి

తాళ్లపూడి: మండలంలోని మలకపల్లి, పెద్దేవం తదితర గ్రామాల్లో డా బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. తాళ్లపూడి బస్టాండ్ వద్ద వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు , నియోజకవర్గ పరిశీలకులు గొండే శ్రీనివాసరెడ్డి , మండల నాయకులతో ఆయన చిత్ర పటానికి పూలమాలలతో నివాళులర్పించారు. పైడిమెట్ట జగ్జీవన్‌రామ్ కమిటీ సభ్యులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిటీ అధ్యక్షుడు కొప్పాక పోసియ్య మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ దళితుల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేశారన్నారు. భారత ప్రభుత్వంలో అనేక మంత్రి పదవులు నిర్వహించారన్నారు. తూర్పు గోదావరి జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షుడు దున్నా దుర్గారావు మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ జీవితం నుంచి దళితులు స్ఫూర్తి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో గెడ్డం రాజు, బొట్టా భాస్కర రావు, పసలపూడి పుష్పరాజు, గెడ్డం గణేష్, గెడ్డం గాంధీ, విజేత పబ్లిక్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు డా.ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.

సంస్కరణల వ్యక్తి

ఉండ్రాజవరం: భారతదేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని మండలంలో కాల్దారీ గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదల కోసం ఎన్నో సంస్కరణలు చేపట్టారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెట్టే సుజన్‌రావు, వైస్ ఎంపీపీ చెట్టే నవీన్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కె.విశ్వనాథం, చెట్టే సర్వేశ్వరరావు, కరుటూరి కృష్ణారావు, స్థానిక సంఘ పెద్దలు పాల్గొన్నారు.

జగజ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

గోపాలపురం: దివంగతనేత దేశ ఉప ప్రధానమంత్రి బాబూ జగజ్జీవన్‌రామ్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు కాకులపాటి శ్రీను వాసు అన్నారు. మండలంలోని భీమోలులో ఆదివారం జగజ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జగజ్జీవన్ రామ్ యూత్ సభ్యులు వాదాలకుంట అరుంధతీ యుజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందిని వెంటనే నియమించాలి



ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు

నిడదవోలు: నిడదవోలు ఆర్టీసీ డిపోలో సిబ్బంది కొరతను వెంటనే పరిష్కరించాలని, డిపో అభివృద్ధి కుంటుపడకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ సౌకర్యాల పోరాట సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా చేపట్టారు. పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని నాయకులు కోరారు. బదిలీ అయిన ఉద్యోగుల స్థానాలను వెంటనే భర్తీ చెయాలని కోరారు. రద్దు చేసిన విశాఖపట్నం సర్వీస్‌ను పునరుద్ధరించాలని, గ్రామాల్లో పలు సర్వీసులను రద్దు చెయ్యటంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, డిపో నిర్వాహణకు ముఖ్యమైన మేనేజర్ పోస్టును వెంటనే భర్తీ చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ జువ్వల రాంబాబు, గంటి కృష్ణ, జి.డానియల్, అంబటి పుల్లారావు, యూసఫ్, షాహీ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో తొలి ఏకాదశి



లక్ష్మీనారాయణ స్వామిని దర్శించుకుంటున్న తానేటి వనిత



ప్రత్యేక పుష్పాలంకరణలో మునిపల్లి శ్రీలక్ష్మీనారాయణ స్వామి



కూరగాయలతో దర్శనమిస్తోన్న ఉండ్రాజవరంలో ముత్యాలమ్మ అమ్మవారు

నిడదవోలు రూరల్: మండల వ్యాప్తంగా తొలి ఏకాదశి పర్వదినాన్ని ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రజలు నిర్వహించుకున్నారు. ఈ మేరకు మునిపల్లి గ్రామంలో శ్రీలక్ష్మి నారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామివారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. పలు గ్రామాల్లోని శివాలయాలు, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులతో తెల్లవారు జాము నుంచే బారులు తీరాయి. ఆలయ కమిటీ సభ్యులు ఇబ్బందులు కలగకుండా కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

మాజీ హోంమంత్రి పూజలు

దేవరపల్లి: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో ఆదివారం వివిధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించి అమ్మవార్లను, స్వామి వారిని దర్శించి అభిషేకాలు నిర్వహించారు. నల్లజర్లలోని శ్రీరామకృష్ణ భక్త మందిరంలో వేంచేసిన లక్ష్మీనారాయణ స్వామి వారికి మాజీ హోంమంత్రి, నియోజకవర్గ ఇంచార్జి తానేటి వనిత స్వామి వారిని దర్శించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెల్లంకి సుబ్రహమణ్యం, ఉల్లూరి శేషగిరిరావు, రాయుడు విజయరావు, మేడ్ని యువరాజు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో తొలిఏకాదశి పూజలు..

ఉండ్రాజవరం: మండలంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం వైష్ణవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెలుగువారి పండుగలు నేటి నుంచే ప్రారంభమవుతాయని భక్తులు భావిస్తారు. ఈ మేరకు పాలంగి, మోర్త, చివటం, కె.సావారం, సూర్యారావుపాలెం, వేలివెన్ను గ్రామాలల్లో రామాలయాలు, ఆంజనేయస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాలల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉండ్రాజవరం, వేలివెన్ను వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పథకాలు ఎప్పుడు ఇస్తావ్ బాబు..?



బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తలారి వెంకట్రావు, తదితరులు

తాళ్లపూడి: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన అమలు చేసేంత వరకు ప్రజల పక్షాన పోరాటం చేయడానికి వైఎస్సార్ సీపీ నిలబడుతుందని కొవ్వూరు నియోజకవర్గ కోఆర్డినేటర్ తలారి వెంకట్రావు అన్నారు. స్థానిక బస్టాండ్ ఆర్యవైశ్య ఫంక్షన్ హాల్ వద్ద బాబు షూరిటీ మోసం గ్యారంటీ మండల స్థాయి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఏడాది పాలనలో ఇప్పటి వరకు వారు ఇచ్చిన హామీలు ప్రకారం తల్లికి వందనం 57 లక్షల మందికే ఇచ్చారని, మిగిలిన 13 వేల కోట్లు ఎప్పుడు ఇస్తావ్ బాబు అన్నారు. నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి రూ. 7,200 కోట్లు, మిగిలిన రెండు సిలిండెర్లకు రూ.3,200 కోట్లు బాకి ఉన్నారని, ఉచిత బస్సుకు ఏడాదికి రూ.270 కోట్లు ఖర్చవుతందని, ఇవన్ని ఎప్పుడు ఇస్తావ్ బాబు అని ప్రశ్నించారు. ఇలా సూపర్ సిక్స్‌లో ఏ పథకం కూడా పూర్తిగా అమలు చేయకుండా మోసం చేసారన్నారు. నియోజక వర్గంలోని అన్ని గ్రామాల్లో నాయకులు వెళ్లి చంద్రబాబు మోసాలను రచ్చబండలు ఏర్పాటు చేసి వివరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ కొలిశెట్టి నాగేశ్వరావు, పార్టీ జిల్లా ఉపాధ్యాక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ హోంమంత్రి పరామర్శలు



వైఎస్సార్ సీపీ నాయకుడు ఆరేళ్ల రంగయ్యను పరామర్శిస్తున్న తానేటి వనిత

దేవరపల్లి: మాజీ హోంమంత్రి, నియోజకవర్గ ఇంచార్జి తానేటి వనిత ఆదివారం నల్లజర్ల మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి ఇటీవల అనారోగ్యానికి గురైన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులను ఆమె పరామర్శించారు. అనంతపల్లి గ్రామానికి చెందిన సాక్షి వేలేకరి టి.సత్యనారాయణ అనారోగ్యానికి గురై విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ మేరకు ఆయనను కలిసి ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. అదే గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు కొరటాని రాంబాబు, ఆరేళ్ల రంగయ్య, తాడేపల్లి నాని, క్రిష్ణప్పగూడెం గ్రామానికి చెందిన బొట్టా సత్తిరాజును పరామర్శించి వారి యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆమె ఆకాంక్షించారు. మండల అధ్యక్షుడు వెల్లంకి సుబ్రహమణ్యం, మండల మహిళా అధ్యక్షురాలు వై.లక్ష్మి, సోషల్ మీడియా కన్వీనర్ సాంబశివ నాయుడు, భీమడోలు వెంకటేశ్వరరావు,రాజేష్, వెంకటేశ్వరరావు, గంగరాజు, పలువురు నాయకులు, కార్యకర్తలు ఆమె వెంట ఉన్నారు.

పశ్చిమడెల్టాకు సాగునీరు విడుదల



పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు విడుదలవుతున్న గోదావరి జలాలు

నిడదవోలు: ఖరీఫ్ వ్యవసాయ అవసరాల నిమిత్తం జలవనరుల శాఖ ధవళేశ్వరం హెడ్ వర్క్స్ అధికారులు పశ్చిమడెల్టా ప్రధాన కాలువకు నీటి విడుదలను క్రమబద్ధకరిస్తున్నారు. గత నాలుగు రోజులుగా విస్తారంగా వర్షాలు కురవడంతో విజ్జేశ్వరం హెడ్‌స్లూయిజ్ నుంచి ఆదివారం 5,800 క్యూసెక్కుల గోదావరి జలాలను కాలువలకు విడుదల చేస్తున్నారు. పశ్చిమడెల్టా పరిధిలో నరసాపురం కాలువకు 1754 క్యూసెక్కులు, తణుకు కాలువకు 500, ఏలూరు కాలువకు 738, అత్తిలి కాలువకు 316 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు.

రేబిస్ టీకా తప్పనిసరి



రేబిస్ వ్యాక్సిన్లు వేస్తున్న వైద్య సిబ్బంది

తాళ్లపూడి (కొవ్వూరు): పట్టణంలోని పశువుల ఆసుపత్రి వద్ద ఆదివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ కుక్క కరిచిన ఏడో రోజు నుంచి నాలుగేళ్లలోపు ఎప్పుడైనా ఈ వ్యాధి లక్షణాలు బయటపడతాయన్నారు. జ్వరం తలనొప్పి, గొంతునొప్పి, మింగ లేకపోవడం, నీటిని చూస్తూ భయపడడం, పిచ్చిగా ప్రవర్తించడం వీటి లక్షణమన్నారు. యాంటీ రేబిస్ టీకా అయిదు డోసులు తప్పనిసరిగా నిర్ణీత గడువులోగా టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు వెంకటరెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు, పరిమి హరి చరణ్, సూరపనేని చిన్ని, కూటమి నాయకులు పాల్గొన్నారు.

43 కుక్కలకు రేబిస్ టీకాలు

చాగల్లు: ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా చాగల్లు లయన్స్ క్లబ్ సహకారంతో ఆదివారం పశు వైద్యశాల వద్ద కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి టీకాలు వేసినట్లు మండల పశు వైద్యాధికారి ముఖేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3 నెలల వయస్సు దాటిన 43 కుక్కలకు ఈ టీకాలు వేశామన్నారు. పెంపుడు జంతువులతో మనుషులకు వ్యాపించే వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. అనంతరం చాగల్లు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కుక్క కాటుకు గురైన వారికి, పశు యాజమానులకు, వైద్య సిబ్బందికి రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డా.టి.మనోజ్, లయన్స్ క్లబ్ సభ్యులు, పెంపుడు జంతువుల యజమానులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు తప్పనిసరి

ఉండ్రాజవరం: జూనోసిస్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తణుకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కోడూరి వెంకట సత్యనారాయణ సూచించారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా మండలం పాలంగి గ్రామంలో తణుకు క్లబ్ ఆధ్వర్యంలో రిటైర్డ్ పశువైద్యాధికారి, లయన్స్ సెక్రటరీ పితాని వెంకటరమణ ఆదివారం కుక్కలకు టీకాలు వేశారు. పెంపుడు కుక్కలకు యజమానులు తప్పనిసరిగా టీకా మందును వేయించాలన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోక్క శ్రీనివాసు, ట్రెజరర్ ఎం.రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.